## క్లుప్తంగా

### త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయండి

బందరు ఎమ్మెల్యే పేర్ని నాని



కోనేరుసెంటర్: బందరు పోర్టు నిర్మాణం ప్రారంభోత్సవ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. శనివారం ఆయన పోర్టు నిర్మాణ పనుల ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించేందుకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ల్యాండ్ అయ్యేందుకు ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించి పోర్టు అధికారులతో మాట్లాడారు. అనంతరం భూమిపూజకు అనువైన ప్రాంతాన్ని పరిశీలించారు. పైలాన్ ఎక్కడ ఏర్పాటు చేయాలన్నది అధికారులకు సూచించారు. కార్యక్రమం మొదలు పూర్తయ్యే వరకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అస్గర్, పోర్టు అధికారులు పాల్గొన్నారు.

### పింఛనుదారుల వితరణ

మచిలీపట్నంటౌన్: 28వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సామాజిక పింఛను లబ్ధిదారుడు మొహమ్మద్ గౌస్ (గోరి) ఇటీవల మృతి చెందాడు. డివిజన్‌లోని తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన మొత్తం రూ. 36,400లను మృతిడి భార్య హఫీజున్నీసాకు శనివారం అందజేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్, యువజన విభాగం డివిజన్ అధ్యక్షుడు తాహెరి, గృహ సారథులు పాల్గొన్నారు.

### బోనస్ పంపిణీ

నాగాయలంక: స్థానిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాలు పోసిన రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో మూడో విడత బోనస్‌ను శనివారం సంఘ అధ్యక్షుడు తలశిల బాబూరావు చేతుల మీదుగా అందజేశారు. 132 మంది సభ్యులకు మొత్తం రూ.1,98,354 పంపిణీ చేశారు. అత్యధికంగా పాలు పోసిన రైతు తలశిల వెంకటేశ్వరరావుకు రూ.9,850 బోనస్ అభించింది. ఏఎంపీఓ ఎం.వరప్రసాదరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి కలశ ప్రతిష్ఠోత్సవం

నాగాయలంక: స్థానిక పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో ఆలయ నూతన కలశ ప్రతిష్ఠోత్సవం సోమవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతనంగా నిర్మించిన అమ్మవార్ల గర్భాలయాల గోపుర శిఖర కలశాలు, ఆలయంలో నూతనంగా శ్రీదాసాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ గుండేపూడి నాగరాజశేఖరశర్మ బ్రహ్మత్వంలో జరుగుతాయన్నారు. 8వ తేదీన జలాధివాసము, అగ్నిప్రతిష్ఠాపనం, 9న మండప దేవత పూజలు జరుగుతాయి. 10న వైదిక కార్యక్రమాలు, అన్నసంతర్పణ జరుగుతాయని వివరించారు.

### నేటి నుంచి ప్రతిష్ఠా కార్యక్రమాలు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం మే 11వ తేదీన ప్రారంభిస్తామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు తెలిపారు. నూతన ఆలయం ప్రతిష్ఠా కార్యక్రమాలు, హోమాలు ఆదివారం నుంచి ఈనెల 11వ తేదీ వరకు జరుగుతాయన్నారు. 11వతేదీ ఉదయం గం.9.36 లకు గణపతి, సుబ్రహ్మణ్య, ఆంజనేయ, కాలభైరవ, నవగ్రహ, జీవ ధ్వజస్తంభ సహిత అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్ల నూతన శిల విగ్రహాల ప్రతిష్ఠ, యంత్రస్థాపన కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

### దీవించమ్మా.. నాంచారమ్మా

కోడూరు: మందపాకల అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి అమ్మవారి ప్రధాన గుడి జాతరకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి మూలమూర్తికి పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. తొలుత ముత్యాలమ్మ అమ్మవారి, అమ్మగారి తల్లి, అంకాలమ్మ అమ్మగార్ల జాతరను కనులపండువగా నిర్వహించారు. అనంతరం పోతురాజు స్వామివారి జాతరను భక్తిప్రపత్తులతో జరిపారు. యువకులు వీడతాడు, ఖడ్గాలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విద్యుత్ ప్రభలను ఆలయం చుట్టూ తిప్పి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. శనివారం అమ్మవారి ప్రత్యేక పూజలతో జాతర ముగిసింది. ప్రధాన అర్చకుడు కాశీభోట్ల శంకరశాస్త్రీ భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త గాదె కృష్ణబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాతరలో ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో 20మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

### మాస్టర్ ప్లాన్ సవరించాలి

మచిలీపట్నంటౌన్: ఎంయూడీఏ రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు సవరణలు చేయాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం ఎంయూడీఏ వీసీ రాజ్యలక్ష్మీకి వినతిపత్రం అందజేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీ, పెడశింగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- జయపురంలో గడప గడపకు మన ప్రభుత్వం



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలతో తోడ్పాటునందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఉద్దేశమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. వి.కొత్తపాలెం సచివాలయ పరిధిలోని జయపురం పంచాయతీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రమేష్‌బాబు, యువ నేత సింహాద్రి వికాస్‌లు వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో కలిసి ఇంటింటికీ తిరిగారు. గ్రామంలోని 217 ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాల లబ్ధిని చదివి వినిపించారు. సంక్షేమ లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్‌ను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాల్లో లేని అనేక పథకాలను కూడా ప్రభుత్వం అమలు చేసిందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచి, కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా చేసుకొని ప్రతి ఒక్కరికీ గడప వద్దకే సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, సర్పంచి యలవర్తి నాంచారయ్య, రైతు సంఘం నేత రేపల్లె రాజయ్య, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, ఎస్సీ, బీసీ సెల్ కన్వీనర్లు వెన్నా ప్రసాద్, చేబోయిన కృష్ణారావు, గ్రామ నేతలు పాల్గొన్నారు.

**మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పిస్తాం**

పురిటిగడ్డ(చల్లపల్లి): మొక్కజొన్న పండించిన రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శనివారం పురిటిగడ్డ పీఏసీఎస్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రమేష్ బాబు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ టి.మురళీ కిషోర్‌తో కలిసి ప్రారంభించారు. రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌లో మొక్కజొన్న పంటకు దళారులు రూ.1,600 కూడా ఇవ్వడం లేదని గమనించి రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే ప్రకటించిన గిట్టుబాటు ధర క్వింటాకు రూ.1,962 అందించేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని చెప్పారు. రైతులు మొక్కజొన్న 14 శాతం లోపు మాత్రమే తేమ ఉండేలా ఆరబెట్టి మద్దతు ధర పొందాలని సూచించారు. మార్క్‌ఫెడ్ డీఎం మురళీ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 14 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు తమ ఉత్పత్తి వివరాలు రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకుని, కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర పొందాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, వైఎస్సార్ సీపీ నాయకులు ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, ఏఓ జి.సాయిసింధు, పీఏసీఎస్ చైర్మన్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**మొక్కజొన్న పంట పరిశీలన**

పురిటిగడ్డలో మొక్కజొన్న ఆరబెట్టుకుంటున్న రైతు మాతంగి ధనరాజును ఎమ్మెల్యే రమేష్‌బాబు పలకరించారు. ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పిస్తోందని, దళారులకు అమ్ముకుని నష్టపోవద్దని సూచించారు.

# పేదలను ఆదుకుంది జగనన్న ప్రభుత్వమే

మంత్రి జోగి రమేష్



కల్యాణమస్తు, షాదీ తోఫా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: నిరుపేదలను ఆదుకుంటోంది జగనన్న ప్రభుత్వమేనని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శనివారం స్థానిక పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ హాలులో పెడన నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా కింద ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి జోగి రమేష్ తొలుత నూతన దంపతులకు అభినందనలు తెలిపారు. జగనన్న ఇచ్చిన కానుకను మీ పిల్లల భవిష్యత్‌కు వినియోగించాలని సూచించారు. పెడన నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ కల్యాణమస్తు షాదీ తోఫా పథకాల కింద 96 జంటలకు రూ.67.15 లక్షల ఆర్థిక సహాయం నిధులు మంజూరయ్యాయని, ఆ నగదు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ అయ్యాయని వివరించారు. నిరుపేద కుటుంబాలలో ఆడపిల్లల వివాహం భారం కాకూడదని ముఖ్యమంత్రి ఈ పథకం ప్రవేశపెట్టారన్నారు. గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, బంటుమిల్లి ఎంపీపీ వెలివెల చినబాబు, కృత్తివెన్ను జెడ్పీటీసీ మైలా రత్నకుమారి, నాయకులు రాజులపాటి అచ్యుతరావు, కొండవీటి నాగబాబు, కొల్లాటి గంగాధర్, మలిశెట్టి రాజబాబు, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, సర్పంచులు, మండల అధికారులు, నూతన వధూవరులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**టీడీపీ సిద్ధాంతాలకు చెల్లు చీటీ..**

పెడన: టీడీపీ సిద్ధాంతాలకు ప్రజలు చెల్లు చీటి ఇస్తున్నారని, ఇందుకు నిదర్శనం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారేనని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శనివారం మండలంలోని కాకర్లమూడి పంచాయతీ కాకర్లమూడి పాలేనికి చెందిన తెలుగుదేశం పార్టీ వార్డు సభ్యుడు గుడిసే నాగ ఆంజనేయులు మంత్రి జోగి రమేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరడంతో పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్ పాలనకు ప్రజలంతా జై కొడుతున్నారని వివరించారు. నాయకులు గరికిపాటి వెంకట రామానాయుడు, మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొండవీటి నాగబాబు, ప్రధాన కార్యదర్శి పామర్తి సాంబశివరావు, వైస్ ఎంపీపీ పరసా రాజేష్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి జి.ఎన్. రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

రూ.6.80 లక్షల జరిమానా

చల్లపల్లి: విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు శనివారం చల్లపల్లి మండలంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్ఈ ఎం.ఆల్ఫ్స్, ఈఈలు కె.వెంకటేశ్వరరావు, సీహెచ్ రాంబొట్లు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది నలభై బృందాలుగా ఏర్పడి 2,324 గృహ కనెక్షన్లు, 212 వాణిజ్య కనెక్షన్లు తనిఖీ చేశారు. వాటిలో 209 సర్వీసులకు అదనపు లోడ్ నిమిత్తం 311 కిలోవాట్ల కోసం రూ.6,80,000 జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, చౌర్యానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 75 లక్షలు మంజూరు

చిలకలపూడి(మచిలీపట్నం): అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని నాగాయలంక మండలం ఎదురుమొండి గ్రామంలో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 75 లక్షలు మంజూరయ్యాయని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులు మంజూరు చేసిందని చెప్పారు. ఎదురుమొండి గ్రామం కృష్ణానది పాయకు అవతలి వైపు ఉన్నందున ఆ గ్రామంలో శుభ కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా ప్రజల కోరిక మేరకు ఈ నిధులు మంజూరు చేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన కనెక్ట్ టు ఆంధ్ర తో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని వివరించారు.

## వితంతువులకు చీరల పంపిణీ

పురిటిగడ్డ(చల్లపల్లి): పురిటిగడ్డ సీఎస్ఐ చర్చిలో శనివారం వితంతువులకు వస్త్రదానం చేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు మద్దాల వీరాస్వామి ఆర్థిక సహకారంతో పురిటిగడ్డ పరిసర గ్రామాలకు చెందిన 50 మంది నిరుపేద వితంతువులకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతులమీదుగా చీరలు అందచేశారు. కార్యక్రమంలో పాస్టర్ నవరత్నమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## ముఖద్వారాల నిర్మాణానికి స్థలాల పరిశీలన

చల్లపల్లి: జగనన్న కాలనీల్లో ముఖద్వారాలు నిర్మించనున్నట్లు తహసీల్దార్ కె.గోపాలకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక జగనన్న కాలనీని పరిశీలించారు. చల్లపల్లిలోని నాలుగు లేఅవుట్లకు, కొత్తమాజేరు జగనన్న కాలనీకి ముఖద్వారాలు నిర్మించనున్నామని చెప్పారు. ఈ మేరకు అనువుగా ఉన్న స్థలాలను పరిశీలించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ ఆరోగ్య సర్వే

లక్ష్మీపురం(చల్లపల్లి): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ కేంద్ర సర్వే బృందం శనివారం చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీలో పుచ్చగడ్డ, ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీల్లోని 300 గృహాల్లో కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించారు. ప్రజల ఆరోగ్యం, ఆహార అలవాట్లు, మరుగుదొడ్ల వినియోగం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. హెల్త్ సూపర్‌వైజర్ తోట సుధాకర్, హెల్త్ విజిటర్ స్వర్ణకుమారి పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): సమగ్రశిక్షా కార్యాలయంలో అసిస్టెంట సెక్టోరియల్ అధికారుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్షా ఏపీసీ ఎ. శేఖర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదేళ్లు కనీస సర్వీసు పూర్తి చేసిన స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు అకడమిక్ ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్‌కు సంబంధించి మార్కుల జాబితాను సమర్పించాలన్నారు. 2023 ఏప్రిల్ 30వ తేదీ నాటికి అభ్యర్థి వయస్సు 50 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమగ్ర శిక్షా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని చెప్పారు.

## సైకిల్, గ్యాస్ సిలిండర్ చోరీపై ఫిర్యాదు

కోనేరుసెంటర్: గుర్తుతెలియని దుండగులు ఇంట్లో వస్తువులు చోరీ చేశారు. చిలకలపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం ఆనందపేటకు చెందిన రేమల్లి శరత్‌బాబు ఇంట్లో ఈ నెల 4వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి ఇంటి బయట ఉన్న రాగి బాయిలర్, సైకిల్‌తో పాటు ఖాళీ గ్యాస్ సిలిండర్‌ను చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## ప్రతి ఒక్కరికీ సొంతిల్లే లక్ష్యం

గూడూరు: సొంతిల్లు లేని అర్హులైన నిరుపేదలందరికీ సొంతిల్లు సమకూర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పౌర సరఫరాల అధికారి వి.పార్వతి అన్నారు. గూడూరు మండలం కప్పదొడ్డిలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను శనివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కప్పలదొడ్డిలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపడుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల వారు కూడా కప్పలదొడ్డి లబ్ధిదారులను ఆదర్శంగా తీసుకుని ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కోరారు. తహసీల్దారు జి.వి.ప్రసాద్, ఎంపీడీఓ డి.సుబ్బారావు, పంచాయతీ రాజ్ ఏఈ హరిబాబు, సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి, వీఆర్వో వరప్రసాద్ పాల్గొన్నారు.

## భూసార పరీక్షలతో మేలు

గూడూరు: భూసార పరీక్షలు చేయించడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ గిరిజారాణి అన్నారు. వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువుల వల్ల కలిగే ప్రయోజనాలపై గూడూరు మండలం కప్పలదొడ్డిలో శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో భూసార పరీక్షలు నిర్వహించడం ద్వారా భూమిలో ఉన్న పోషకాలపై అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీ కె.జ్యోతిరమణి, ఏడీఏ కె.శ్రీనివాసరావు, బందరు ఏడీఏ జీవీ శివప్రసాద్, వీఏఏ బ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంగళాపురం(చల్లపల్లి): చల్లపల్లి మండల పరిధిలోని మంగళాపురం వద్ద జాతీయ రహదారి-216పై రోడ్డు ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన టి.రాజేష్ మోపెడ్‌పై హైవే దాటుతుండగా హైవేపై ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టి అదుపు తప్పి పొలాల్లోని దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రాజేష్‌తో పాటు, కారులో ఉన్న విజయవాడకు చెందిన వెంకట్రావ్, జనార్ధనరెడ్డిలకు గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- నష్టం అంచనాలు క్షేత్రస్థాయిలో పరిశీలన
- జిల్లా ప్రత్యేకాధికారి లక్ష్మీశా



కె. కొత్తపాలెంలో రాశిగా పోసిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న లక్ష్మీ శా

మోపిదేవి: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టం అంచనా రిపోర్టును ఉన్నతాధికారులకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందజేస్తామని జిల్లా ప్రత్యేకాధికారి లక్ష్మీశా తెలిపారు. మోపిదేవి లే అవుట్-1, బొబ్బర్లంక, కె. కొత్తపాలెంలో గ్రామ సచివాలయాలను సందర్శించి, ఆర్‌బీకేల వద్ద పంట నష్టం వివరాలతో పాటు, దెబ్బతిన్న పంట పొలాలను శనివారం పరిశీలించారు. తొలుత లే అవుట్స్‌ను పరిశీలించి త్వరిత గతిన గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మోపిదేవి వార్పు వద్ద ఆరపెట్టిన పసుపు దుంపలు, కె. కొత్తపాలెంలో మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లక్ష్మీశా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వర్షాలకు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆర్‌బీకేల వద్ద నమోదైన వివరాలు సేకరిస్తున్నామన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని, నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అవసరమైతే తేమ శాతాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని రైతు పండించిన ప్రతి గింజకు ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు హార్టికల్చర్ మామిడి వంటి పంటలకు కూడా నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పారు. మచిలీపట్నం ఆర్డీఓ కిషోర్, వ్యవసాయ శాఖ జేడీ, గృహ నిర్మాణ శాఖ డీఈ భానోజీరావు, ఏఈ రాజులపాటి తాండవకృష్ణ, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఎంపీడీఓ పార్వతి, సర్పంచ్‌లు దిడ్ల రాంబాబు, కొక్కిలిగడ్డ మాధవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

# తీర్పుపై అవగాహన కల్పించండి

మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు

చిలకలపూడి(మచిలీపట్నం): సుప్రీంకోర్టులో 50 సంవత్సరాల కిందట ఇచ్చిన తీర్పు వివరాలను న్యాయ వ్యవస్థలో పనిచేస్తున్న వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ కేశవానంద భారతి కేరళ రాష్ట్ర ప్రభుత్వంపై వేసిన కేసులో 13 మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం 1973 ఏప్రిల్ 24వ తేదీన తీర్పును వెలువరించిందన్నారు. ఈ తీర్పులో రాజ్యాంగం మౌలిక సూత్రాలకు భంగం కలిగించరాదని సూచించారని చెప్పారు. న్యాయమూర్తులు డాక్టర్ షేక్ మొహమ్మద్ ఫజులుల్లా, చినబాబు, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం. రామకృష్ణ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య, మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల శివరామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

# సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

మోపిదేవి: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ సిబ్బందిని ఆదేశించారు. మోపిదేవి అవుట్ పోస్టు కార్యాలయంలో శనివారం పోలీసులు, సచివాలయ మహిళా కానిస్టేబుల్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయంలోని మహిళా పోలీసులు గ్రామాల్లో శాంతి భద్రతల పరిస్థితులపై ప్రత్యేక నిఘా ఉండాలని, సమస్యాత్మక గ్రామాలపై మరింత జాగ్రత్తగా మెలగాని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మాణంలో ఉన్న పోలీస్ స్టేషన్‌ను సందర్శించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. చల్లపల్లి సీఐ రవికుమార్, ఎస్‌ఐ పద్మ, సచివాలయ మహిళా కానిస్టేబుల్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 'పది'లో విద్యార్థుల ఉత్తమ ఫలితాలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గంలోని 26 పాఠశాలల్లో పది ఫలితాల్లో 60.50 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. నియోజకవర్గంలో మొత్తం 1,228 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 743 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 637 మంది బాలురు పరీక్షకు హాజరుకాగా 333 మంది ఉత్తీర్ణులయ్యారు. 591 మంది బాలికలు పరీక్షకు హాజరుకాగా 410 మంది ఉత్తీర్ణులయ్యారు. నగరంలో ఏడు మునిసిపల్, రెండు ప్రభుత్వ, మూడు ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 41 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారు. బందరుకోట మునిసిపల్ హైస్కూల్ 86 శాతం, రుస్తుంబాద బాలికల పాఠశాల 76 శాతం, రుస్తుంబాద బాలుర పాఠశాల 67 శాతం, గిలకలదిండి హైస్కూల్ 69 శాతం, దేశాయిపేట 60, కాలేఖాన్‌పేట హైస్కూల్ 67 శాతం, చిలకలపూడి పాండురంగ హైస్కూల్ 72 శాతం, రాంజీ ప్రభుత్వ పాఠశాల 33 శాతం, లేడీయాంప్తిల్ హైస్కూల్ 75 శాతం, జార్జికార్నేషన్ ఎయిడెడ్ స్కూల్ 44 శాతం, షార్కీ ఎయిడెడ్ స్కూల్ 67 శాతం, జైహింద్ ఎయిడెడ్ స్కూల్ 56 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

- **కోడూరు:** పది పరీక్షా ఫలితాల్లో కోడూరు విద్యార్థులు సత్తా చాటారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటాపోటీగా మార్కులు సాధించారు. మండలంలోని ఐదు జెడ్పీ పాఠశాలల నుంచి 206 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 154 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ టీవీఎం రామదాసు తెలిపారు. ఐదు ప్రైవేటు పాఠశాలల నుంచి 136 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కాగా 127 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు అభినందించారు.
- **గూడూరు:** పదో తరగతి పరీక్షా ఫలితాలలో గూడూరు మండలం 73 శాతం ఉత్తీర్ణత సాధించింది. మండలం నుంచి మొత్తం 382 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 280 మంది ఉత్తీర్ణులయ్యారు.

**ముక్కొల్లులో నూరు శాతం ఉత్తీర్ణత..**

ముక్కొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించింది. పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. కప్పలదొడ్డి హైస్కూల్ నుంచి 68 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 53 మంది, కంకటావ హైస్కూల్ నుంచి 37 మంది విద్యార్థులకుగాను 29, గూడూరు హైస్కూల్ నుంచి 71 మందికి గాను 56, తరకటూరు హైస్కూల్ నుంచి 35 మంది విద్యార్థులకుగాను 27మంది, మల్లవోలు హైస్కూల్ నుంచి 145 మంది విద్యార్థులకుగాను 96, రాయవరం హైస్కూల్ నుంచి 19 మంది విద్యార్థులకుగాను 12 మంది ఉత్తీర్ణులయ్యారు.

- **నాగాయలంక:** నాగాయలంక మండలంలోని అయిదు ప్రభుత్వ, రెండు ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు 335 మంది రాశారు. వీరిలో 253 మంది ఉత్తీర్ణతతో 73 శాతం ఫలితాలు సాధించారని ఎంఈఓ టీవీఎం రామదాస్ తెలిపారు. నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో పరీక్షకు హాజరైన 156 మందిలో 117మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని తలగడదీవి హైస్కూల్‌లో 66 శాతం, భావదేవరపల్లిలో 67 శాతం, ఏటిమొగలో 83 శాతం, ఎదురుమొండిలో 31 శాతం ఫలితాలు సాధించారు.
- **మోపిదేవి:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 302 మంది పరీక్షకు హాజరుకాగా 216 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 72 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ కె. రాజ్‌కుమార్ తెలిపారు. వెంకటాపురం జెడ్పీ పాఠశాలలో 8 మందికి గాను ఏడుగురు ఉత్తీర్ణతతో 88 శాతం సాధించారు.
- **పెడన:** పదో తరగతి ఫలితాల్లో పెడన మండలం 66 శాతం ఉత్తీర్ణత సాధించారు. పెడన మండలంలో ఏడు జిల్లా పరిషత్, ఒక గురుకుల పాఠశాల నుంచి 447 మంది విద్యార్థులు హాజరు కాగా వీరిలో 294 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 268 మందికి 203, బాలురు 179 మందికి 91 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తీర్ణతను పరిశీలిస్తే నందమూరు 67 శాతం, చెన్నూరు 70 శాతం, నందిగామ 78, పెనుమల్లి 78, చేవేంద్ర 60, తోటమూల 84, బీజీకే జెడ్పీహెచ్ఎస్ పెడన 51 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. బల్లిపర్రు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 82 శాతం ఉత్తీర్ణత సాధించారు.
- కృత్తివెన్నులో 66.73 శాతం ఉత్తీర్ణత సాధించారు. 11 జెడ్పీహెచ్ఎస్‌లు ఉన్నాయి. ఇంతేరు 37 శాతం, పల్లెపాలెం 54 శాతం, చినపాండ్రక 62, లక్ష్మీపురం 63, నీలిపూడి 100, మాట్లం 78, పోడు 66, కొమాళ్లపూడి 100, సంగమూడి 67, తాళ్లరేవు 80, చిన్నగొల్లపాలెం 51 శాతం చొప్పున ఉత్తీర్ణులయ్యారు.
- బంటుమిల్లి మండలంలో 64 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 9 జిల్లా పరిషత్, ఒకటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మండలం నుంచి 373 మందికి 238 మంది ఉత్తీర్ణులై 64 శాతం సాధించారు. పెదతుమ్మిడి 48, మలపరాజుగూడెం 72, నెహ్రూనగర్ 75, చోరంపూడి 88, పెందుర్రు 42, ఆర్తమూరు 75, ముంజులూరు 50, కంచడం 100, బంటుమిల్లి 61, బంటుమిల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 47 శాతం ఉత్తీర్ణులయ్యారు.
- **అవనిగడ్డ:** పదో తరగతి ఫలితాల్లో మండలంలోని మొత్తం 11 స్కూల్స్ నుంచి 548 మంది పరీక్షలకు హాజరు కాగా 467 మంది ఉత్తీర్ణతతో 85 శాతం ఫలితాలు సాధించారు. పులిగడ్డ గురుకుల పాఠశాలలో 69కి 69, అవనిగడ్డ శ్రీ చైతన్య 90కి 90, ప్రగతి స్కూల్ 25కి 25 మంది ఉత్తీర్ణతతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవనిగడ్డ ఉన్నత పాఠశాల 198కి 139 మందితో 71 శాతం, నారాయణ 49కి 46తో 94 శాతం, అవనిగడ్డ జెడ్పీ హైస్కూల్ 11కి 10తో 91శాతం, ఎస్ఆర్ఐ వికాస్ 23కి 21తో 91 శాతం, సెయింట్ ఆన్స్ స్కూల్ 29కి 26తో 90 శాతం, వేకనూరు జెడ్పీ హైస్కూల్ 7కి 5తో 71 శాతం, సెవెంత్‌డే స్కూల్ 6కి 4తో 67 శాతం ఉత్తీర్ణత సాధించాయి.
- ఘంటసాల మండలంలో ఘంటసాల జెడ్పీ హైస్కూల్‌లో 88 మందికి 48 మంది ఉత్తీర్ణతతో 56 శాతం సాధించగా, లంకపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 14కి 10తో 71 శాతం, శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ 51కి 23తో 45 శాతం, గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 38కి 33తో 87 శాతం, కొడాలి జెడ్పీ హైస్కూల్‌లో 21కి 15తో 71 శాతం, చిట్టూరు జెడ్పీ హైస్కూల్‌లో 14కి 8తో 57శాతం, మల్లంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 14కి 10 మంది విద్యార్థులు ఉత్తీర్ణతతో 71 శాతం ఫలితాలు సాధించారు.

## భూ సర్వే సక్రమంగా నిర్వహించాలి

పాగోలు(చల్లపల్లి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష సర్వేను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ అన్నారు. శనివారం పాగోలులో జరుగుతున్న సమగ్ర భూ సర్వేను తహసీల్దార్ పరిశీలించారు. వీఆర్వోలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.